
# పోలీసు భార్య

## పెద్దూరి వెంకటదాసు

"సంధ్యా! కాస్త అలసటగా ఉంది. విల్ యూ ప్లీజ్ గెట్ మి ఎ కప్ ఆఫ్ కాఫీ" లాలనగా అడిగాడు భార్యని రవీంద్రనాథ్.

ఏప్రిల్ ఎండలు, అందునా బందోబస్తు డ్యూటీ. వళ్ళంతా చిటపటగా ఉంటే త్వరగా ఇంటికి చేరుకుని తడిసి ముద్దయిన యూనిఫాం తీసి హేంగర్‌కు తగిలించి ఫ్రెష్‌గా స్నానం చేసి వచ్చి కాఫీ తాగుతూ రిలాక్స్ అవుదామనుకున్నాడు. భర్త మాట కూడా తనకు విన్పించనట్టు చదువుతున్న పుస్తకంలో లీనమై అలాగే కూర్చుండిపోయింది.



"సంధ్యా" పిలిచాడు మళ్ళీ కాస్త సేదతీరాక. అలసిన మనసుకి స్నానం చేసి కూర్చుంటే ఎంతో హాయి అనిపించిందతనికి.

"ఏం! ఆమాత్రం కాఫీ కలుపుకోలేరా! అయినా మీ పోలీసు వాళ్ళకి వాళ్ళ ఏరియాలో ఏది కావాలన్నా ఆఘమేఘాల మీద సమకూరుస్తారటగా, ఏం మీకు కాఫీ కూడా తాగడాని హోటల్ దొరకలేదా! అందరి ఇచ్చేవాళ్ళు మీకు మాత్రమే ఇవ్వరా!" చూస్తున్న మ్యాగజైన్‌లో నుంచి తలెత్తకుండానే వ్యంగ్యంగా జవాబిచ్చింది సంధ్య.

తనీవేళ మార్కెట్ నుంచి బస్సులో వస్తుంటే ఎంత చులకనగా మాట్లాడారని పోలీసు వాళ్ళ గురించి, వాళ్ళ సంపాదన గురించి. బస్సులో తన పక్కనున్నావిడ కామెంట్ చేస్తుంటే వంట్లో తేళ్ళు జర్రులు పాకినట్టనిపించింది. చివరకొకావిడ 'మీవారేం చేస్తుంటారని' అడిగితే 'ఫలానా' అని సిగ్గుతో చెప్పుకోలేకపోయిన సంఘటన గుర్తుకొచ్చింది సంధ్యకాక్షణంలో. నరనరాన మూర్ఖత్వం జీర్ణించుకున్న భార్యను చూసి ఏమనాలో అర్థంకాలేదు రవీంద్రనాథ్‌కి. మౌనంగా బయటకు నడిచాడు. మనసేం బావుండక పక్కవాటాలోని మిత్రుడు రామారావ్‌ను కలిసి కాస్త ఊరట చెందుదామని వెళ్ళిన రవీంద్రకి నిరాశే ఎదురైంది. అతడు తనని స్నేహితుడిలా కాక ఒక పోలీస్‌గా ట్రీట్ చేస్తూ ఆచితూచి మాట్లాడడం రవీంద్రని తీవ్ర మనస్థాపానికి గురిచేసింది. నిరాశతో వెనుదిరిగాడు.

రవీంద్రనాథ్ ఊహించింది వేరు. జరుగుతున్నది మరోలా వుంది. తన కిష్టమైన పోలీస్ ఉద్యోగంలో చేరాలన్న అతని జీవితాశయం నెరవేరింది కాని, తనకిష్టంలేని సంధ్యని పెళ్ళి చేసుకోమని తల్లి పట్టుబట్టడం, ఆమె మాట కాదనలేని తన బలహీనత – వెరసి సంధ్యతో కాపురం వెలగబెట్టడం. సొంత మేనమామ కూతురైన సంధ్య గురించి, ఆమె పెంకితనం గురించి రవీంద్రనాథ్‌కి ముందే తెలిసినా తల్లికోసం తను కష్టపడ్డా ఆమె మనసును కష్టపెట్టకూడదనే ఈ పెళ్ళికి ఒప్పుకున్నాడు రవీంద్ర.

"సంధ్యకు మీ అన్నయ్య సంబంధం చూశాడట. అబ్బాయి ఈ ఊళ్ళోనే లెక్చరర్‌గా ఉద్యోగం చేస్తున్నాడట" అని దూరపు బంధువాకాయన చెప్పినప్పుడు రాజ్యలక్ష్మికి దుఃఖం పొంగుకొచ్చింది. ఆ రాత్రి ఆమెకు నిద్రపట్టలేదు. ఆ మరునాడుదయమే పొరుగూర్లో

వున్న అన్నయ్య దగ్గరకెళ్ళి కలిసింది.

సంధ్యకు స్వయాన మేనత్తయిన రాజ్యలక్ష్మి – ''అన్నయ్యా! నా భర్త చనిపోయినప్పుడు, ఇక నా బ్రతుకు బుగ్గిపాలేనని క్రుంగిపోతున్నప్పుడు – నీవు నూరిపోసిన ధైర్యంతోనే పరిస్థితులకెదురీది నా కొడుకును చదివించుకున్నాను. నా తర్వాత నా కొడుకు అనాథ కాకూడదు, వాడ్ని బాగా చదివించి 'సంధ్యకు తగిన వరుడు రవీంద్ర' అని మీ అందరికీ అనిపించినప్పుడు అప్పుడు చెబుదామని నా మనసులోని మాటను ఇన్నాళ్ళు నాలోనే దాచుకున్నాను. ఆ ఒక్క ఆశతోనే నేను బ్రతుకుతున్నాను. నా అన్నయ్య నీడన నా కొడుకు చేరాలి. అదే నా ఆశయం అన్నయ్యా! సంధ్య నీకు ఏకైక ముద్దుల కూతురే కాదు – నాకు ప్రాణప్రదమైన మేనకోడలు కూడా. నీ తాహతుకు తగ్గట్టు సంధ్యకు సరిజోడుగా వాడు ఎదిగిననాడే నీకీ విషయం గర్వంగా చెప్పాలనుకున్నాను'' దుఃఖం పొంగుకొస్తోంది రాజ్యలక్ష్మికి. అన్నయ్య ఎదుట నిలబడి ఆమాత్రం ఆమె ఏనాడైనా మాట్లాడిందంటే అది ఈరోజే.

''చూడమ్మా! నీవేనాడు చూచాయగా కూడా నాకీ విషయం చెప్పలేదు. రక్తసంబంధం నీకేనా నాకు కూడా. మీ వదిన గురించి, సంధ్య గురించి నీకంతా తెలుసు. మీ వదిన అతి గారాబం వల్ల సంధ్య అలా పెంకిగా తయారైంది. మన రవీంద్రను కూడా చులకనచేసి మాట్లాడడం ఒకటిరెండుసార్లు నేను గమనించి మందలించాను కూడా. రవీంద్ర కూడా ఇంట్లో వున్నంతసేపు సంధ్య నుంచి తప్పించుకు తిరిగేవాడు. అమ్మాయి వాడ్ని నచ్చట్లేదని నాకు తెలుసు కానీ, రవీంద్రకు సంధ్య అంటే అభిమానం వున్నట్టు కూడా నేను గమనించలేదు.

రాజ్యలక్ష్మి అసలు అమ్మాయి మనసులో ఏముందో తేలిపోతుందనే ఈ లెక్చరర్ సంబంధం చూశాను. ఆ అబ్బాయిని చూసిన తర్వాత మీ వదిన చెప్పింది 'నాకే కాదు సంధ్యకు కూడా ఆ అబ్బాయి నచ్చాడని, ఇక ఆలస్యం దేనికని'. ఎందుకనో వెంటనే ఊ అనలేకపోయాను. తర్వాత కబురు చేస్తామన్నాను. నీవు బైటపడ్డావీనాడు. నా మనసులోని మాటను చెప్పలేక, రవీంద్రను కాదనలేక, మరొకర్ని అల్లునిగా నా మనసు అంగీకరించక – వాళ్లు ఇష్టపడ్డ ఆ లెక్చరర్ అబ్బాయిని కాదనలేక నేనెంత మదనపడ్డానో నీకేం తెలుసు.

సంధ్య అంటే నీకెంత ఇష్టమో నేను గమనించక పోలేదు. రవీంద్ర అంటే నాకూ అంతే ఇష్టమని నేనెలా చెప్పేది. వాళ్ళు ఎడమొగం పెడమొగంగా ఉండి నాకా అవకాశమే లేకుండా చేశారు. పట్నంలో చదువుతున్న వాడి దగ్గరికి అప్పుడప్పుడు వెళ్ళిరావడమేకాదు, చాటుగా వాకబ్ చేస్తుండేవాడిని. మాట దాటని తనయుడిగా నీ అదృష్టంకొద్దీ వాడు నీ కొడుకుగా పుట్టాడు. ఉద్యోగ ప్రయత్నంలో ఉన్నాడట. మొన్నెళ్ళినప్పుడు వాడే చెప్పాడు. చూడు రాజ్యలక్ష్మీ మన ప్రమేయం లేకుండానే కొన్ని జరుగుతుంటాయి. నేనా లెక్చరర్ సంబంధం విషయంలో మాటివ్వకముందే నీవు వచ్చి కలవడం దైవనిర్ణయం. నీ ఇష్టప్రకారమే రవీంద్రతో మాట్లాడిన తర్వాత నీ నిర్ణయాన్ని తెలుపు. ఆ తర్వాత నా కూతుర్ని ఎలా కన్విన్స్ చేయాలో నేనాలోచించుకుంటాను. అంతవరకు నేనెవరికీ మాటివ్వను – సరేనా''

అన్నయ్య నోట వెలువడ్డ ఆ ఒక్కమాట వెయ్యి ఏనుగుల బలాన్నిచ్చింది రాజ్యలక్ష్మికి.

''వెళ్ళొస్తానన్నయ్యా'' అంటూ ఆఘమేఘాల మీద బయలుదేరింది – ఏదో నిర్ణయానికి వచ్చినదానిలా.

ఊరి సర్పంచ్‌గా ఆ ఊళ్ళో ఎవరికి ఏ కష్టమొచ్చినా తానే ముందుండి ఆదుకునే వ్యక్తిగా వెంకట్రామయ్యకి మంచి పేరుంది. తాలూకా హెడ్‌క్వార్టర్స్ అయినా ఆ ఊరికి డిగ్రీ కాలేజీ కావాలని పోరాడి మరీ సాధించారాయన. ఆ ఊరికి సమీపంలో వుండే పొరుగూళ్ళో చెల్లెలు రాజ్యలక్ష్మి దగ్గరికి ఎన్ని పనులున్నా కనీసం వారంలో ఒక్కసారయినా వెళ్ళి వచ్చేవారాయన. చెల్లెలంటే అంత ప్రేమతనికి. చెల్లెలు గుణగణాల్నే పుణికి పుచ్చుకున్న మేనల్లుడు రవీంద్ర కూడా మామగారింట్లో వుండి చదువుకోమంటే – దూరమైనా పొరుగూరు నుంచి ఈ ఊరికి రోజూ నడిచివచ్చి వెళ్ళేవాడు స్కూలుకి.

అన్నయ్యతో మాట్లాడి ఇంటికెళ్ళిన రాజ్యలక్ష్మికి కొడుకు దగ్గరి నుంచి వచ్చిన లెటరు ఆమె ఆశలకు కొత్త ఊపిరులూదింది.

''అమ్మా నేను పోలీసు శాఖలో సబ్‌ఇన్‌స్పెక్టర్‌గా సెలెక్ట్ అయ్యా''నని ఆమె ఆనందానికి అవధుల్లేవు. ఈ విషయం వెంటనే అన్నయ్యకి చెప్పాలి. ఆమె ఇక క్షణం కూడా వృథా చేయదలచుకోలేదు. ఆనాటి ఆ అన్నాచెల్లెళ్ళ ప్రయత్నాల పర్యవసానమే – ఈ సంధ్యా రవీంద్రల సంగమం.

తమ పెళ్ళికి దారితీసిన పరిస్థితులను మననం చేసుకుంటూ చాలాసేపు గడిపాడు. నెమ్మదిగా లేచి వెళ్ళి భార్య దగ్గరికి చేరి, సుతారంగా ఆమె చేతిలోని పుస్తకాన్ని తీసుకుని పక్కన పెట్టి భుజంమీద చేయి వేస్తూ అన్నాడు – ''సంధ్యా! సి.పి.గారు నాకు మూడువేలు క్యాష్ రివార్డ్ ఇచ్చి ప్రశంసించారు. నేను చార్జ్ తీసుకున్న సున్నితమైన ఔట్‌పోస్ట్‌లో నెల రోజుల్లో సంఘ వ్యతిరేక శక్తులను అణచివేసి లా అండ్ ఆర్డర్ కాపాడినందుకు.''

''ఛ! ముష్టి మూడువేలకు అంత ఆనందం దేనికి. మా నాన్నగారు ఎంతోమంది పేదలకు మెట్టెలు, మంగళసూత్రాలు చేయించుకోండని ఇంతకన్నా ఎక్కువే ఇచ్చేవారు. ఈమాత్రం దానికి ఇంత మురిసిపోవాలా!''

''సంధ్యా! సి.పి.గారు నాకు మూడువేలు క్యాష్ రివార్డ్ ఇచ్చి ప్రశంసించారు. నేను చార్జ్ తీసుకున్న సున్నితమైన ఔట్ పోస్ట్‌లో నెలరోజుల్లో సంఘ వ్యతిరేక శక్తులను అణచివేసి లా అండ్ ఆర్డర్ కాపాడినందుకు.''
''ఛ! ముష్టి మూడువేలకు అంత ఆనందం దేనికి. మా నాన్నగారు ఎంతో మంది పేదలకు మెట్టెలు, మంగళసూత్రాలు చేయించుకోండని ఇంతకన్నా ఎక్కువే ఇచ్చేవారు. ఈమాత్రం దానికి ఇంత మురిసిపోవాలా!''

ఛళ్ళున చెంపమీద చరిచినట్లయింది రవీంద్రకి. పైసాపైసాకి కష్టపడి చదువుకున్న తనకి, డబ్బులో పుట్టి పెరిగిన సంధ్యకి ఏమిటీ పొత్తు. అమ్మ చిరకాల వాంఛ, మామయ్య మంచితనం – తను సంధ్యతో జీవితం పంచుకునేలా చేశాయి కానీ, ఆమె తనపట్ల చూపే చులకన భావం తెలియక కాదు.

అడ్జస్టయి బ్రతకాలనుకున్న రవీంద్రకి ఇది రోజూ వున్నదే.

''సంధ్యా! క్యాష్ రివార్డ్ అంటే – డబ్బులు కాదు ప్రధానం. గుర్తింపు. డబ్బుతో వెలకట్టడం కాదిక్కడ – ఓ ఉన్నతాధికారి స్వయంగా మనల్ని ప్రశంసించి రివార్డునందచేయడం. సినీ జగతికి దేశం గర్వించదగ్గ దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు కింద గ్రహీతలకు అందే పారితోషికం ఎంతో తెలుసా – లక్ష రూపాయలు. ఆ స్థాయికెదిగిన ఆ మహామహులకు ఆ లక్ష రూపాయలు ఏపాటికి. అవార్డులకందే పారితోషికం పదివేలు కూడా వుంది. కానీ దాన్నందుకోవడమే వరంగా భావించే కళాకారులు, సాంకేతిక నిపుణులు నీకు కనిపించలేదా! చదువుకున్నదానివి ఆమాత్రం అర్థం చేసుకోలేవా! అయినా రోజూ న్యూస్‌పేపర్ చూస్తుంటావుగా. 'ఆత్మహత్య చేసుకోవడానికి సాగర్‌లోకి దూకిన మహిళను రక్షించిన కానిస్టేబుల్‌కు ఐదొందల క్యాష్ రివార్డ్ ప్రకటించిన డి.సి.పి.' అంటే దానర్థం ఒక ప్రాణం కాపాడినందుకు ఐదొందలని వెలకట్టినట్టా! అతను సత్కారానికి అర్హుడని గుర్తించి గౌరవించినట్టు. నికరంగా ఇది దానర్థం. నీవెలా అనుకున్నా పర్వాలేదు. నేనేదో సంపాదించానని నీకు చెప్పలేదు. క్యాజువల్‌గా చెప్పానంతే'' అలా ఎంతోసేపటికి గాని ఆమెను ప్రసన్నం చేసుకోలేకపోయాడు. చివరగా ఆ మరుసటిరోజే తమ పెళ్ళిరోజన్న సంగతి గుర్తుచేసి –

''పర్వాలేదే! డ్యూటీరోజు కాక మరోరోజు ఒకటుందని, దాన్ని పెళ్ళిరోజంటారని మీ పోలీసు మైండుకి కూడా తట్టిందే'' ఉడికిస్తూ అంది సంధ్య, భర్త పక్కన చేరి ఒదిగిపోతూ. ఆ మరునాడు ఉదయాన్నే లేచి రోజూలాగే జాగింగ్, స్నానపూజాదులు ముగించుకుని యూనిఫాం వేసుకుంటున్న భర్త దగ్గరికి వచ్చి షర్ట్ బటన్స్ పెడుతూ గారాలు పోతుంటే, అప్పుడే అనిపించింది రవీంద్రకి – ఆమె ఏం కోరినా కొనివ్వగలడు పెళ్ళి కానుకగా, ఒక్క తన సమయాన్ని తప్ప అని అనుకుంటున్నంతలోనే తను అడగనే అడిగింది. ఏదైతే తనివ్వలేడో అది.

''కనీసం ఈరోజైనా త్వరగా రండి. హాయిగా ఏ హోటల్‌లోనో భోంచేసి ఎంచక్కా సినిమాకెళ్దాం'' అంది గోముగా సంధ్య. చాలా అరుదుగా ఆమె ఆ మూడులోకొస్తుంది. ఆ వాతావరణాన్ని, ఆమె మూడ్‌ని డిస్టర్బ్ చేయకుండా చిరునవ్వే సమాధానంగా బైటపడ్డాడప్పటికి రవీంద్రనాథ్.

ఆ చిన్నకోరిక ఆమె కోరడం సమంజసమేనని రవీంద్రకి తెలియకనా! ఆ మాటకొస్తే అతనికి మాత్రం భార్యతో సరదాగా షికారుకెళ్ళాలని, ఎంజాయ్ చెయ్యాలని ఉండదా! ఎన్నో జంటలు

ఎంజాయ్ చేసే విహార స్థలాల్లో డ్యూటీలో భాగంగా పర్యవేక్షించేటప్పుడు తనకు స్ఫురించలేదా – తానేం మిస్సవుతున్నాడో! అయినా భార్యకు వస్తానని ప్రామిస్ చేసి కమిట్‌మెంట్‌కు కట్టుబడే ఉద్యోగం కాదు తనది. అయినా అతనేనాడూ బాధపడలేదు సరికదా, అందరూ సంతోషంగా గడపడానికి ఆనందించడానికి జంటలుగా, పిల్లాపాపలతో వస్తే తన మాత్రం వాళ్ళకు రక్షణగా రావడం అదృష్టమనుకున్నాడు. భార్యాపిల్లలతో వస్తే అందరిలో తనూ ఒకడు కానీ, ఇప్పుడు అందరికీ రక్షణనిచ్చే తనొక్కడు. తన పరిధిలోని ఈ పార్కులోకి వచ్చేవారిపై ప్రైవసీకి భంగం కలుగకుండా, అసాంఘిక శక్తుల ఆటకట్టించినందుకు బోసిపోయినట్టుండే ఆ పార్కు నేడు కళకళలాడుతుంటే అది ఆనందాన్నిచ్చే అంశం కాదా అతనికి. అదే పోలీసు ఉద్యోగం. ఇది తలచుకున్నప్పుడల్లా కొత్త శక్తి వస్తుందతనికి. ఆ వృత్తి మాధుర్యాన్ని తానెన్నోసార్లు చవిచూశాడు. ఈ విషయం తనకు గుర్తొచ్చినప్పుడల్లా చంద్రునిలో మచ్చలా ఈ వృత్తిమీద ఏహ్యభావం పెంచుకున్న భార్య తలంపుకి రావడం రవీంద్ర దురదృష్టం.

ఆరోజు అనుకున్నంతా జరిగింది. అత్యవసరమైన కేసు విషయంలో ఇంటరాగేట్ చేస్తూ ఆ రాత్రి ఇంటికి ఆలస్యంగా చేరడం – ఆమె ఆవేశం కట్టలు తెంచుకోవడం. ''బోడి ఉద్యోగం. ఎప్పుడు ఏదోఒక సాకు. ఎవరికీ లేని పని మీకే వుంటుందా. ఈమాత్రం జీతం ఏ ఉద్యోగం చేసినా వస్తుంది. ఏనాడైనా మీరు చెప్పిన టైంకి వచ్చారా! భార్య అనే ఒక జీవి ఇంట్లో ఒంటరిగా పడిగాపులు కాస్తుందని, ఆమెకీ ఓ మనసుందని, దానికి కొన్ని కోరికలుంటాయని ఎప్పుడయినా కనీసం ఒక్కసారయినా ఆలోచించారా! ఏ వయసుకాముచ్చట అందమైన సాయంత్రాలు ఎన్ని దొర్లిపోతున్నా, ఎన్ని ఆశల్ని చంపుకున్నా కనీసం నోరు తెరిచి అడిగినప్పుడైనా వీలు చేసుకుని రావచ్చుగా. అయినా మిమ్మల్ని అని ఏం లాభం! అంతా నా దురదృష్టం – కాదు మీ అమ్మే. ఆమే నా బ్రతుకులో చీకట్లు నింపింది – ఆఖరుక్షణంలో వచ్చి. లేకుంటే, ఆ లెక్చరర్‌తో నా వివాహం. దుఃఖంతో కంపిస్తుందామె గొంతు మాట్లాడలేక.

''సంధ్యా! ఇక చాలు. దేనికయినా ఓ హద్దుంటుంది. నీ ఆస్తిని, అందాన్ని చూసి కాదు నిన్ను చేసుకుంది. మా అమ్మ మాటను కాదనలేక, మావయ్య మంచితనానికి, ఆయనమీది గౌరవంతో నీవెన్నన్నా సహించాను. మీ నాన్న అన్న ఒక్కమాట – అదే నన్ను ఇంతవరకు నిగ్రహం కోల్పోకుండా నీవెన్నన్నా సహించేలా చేసింది. 'ఒరే రవి! మీ అమ్మ తన మనసులోని మాటను చెప్పినప్పుడు నా మనస్సు ఎంత పులకించిపోయిందో తెలుసా! స్వాభిమానం గల మీ అమ్మను 'నా కూతుర్ని నీ కోడలిగా చేసుకో' అని నా మనసులోని మాటను అడగలేక – ఆ లెక్చరర్ సంబంధం ఖాయం చేసుకుందామని మీ అత్తయ్య వత్తిడి చేస్తుంటే నా అంతరాత్మ నీ మీది మమకారంతో నన్ను మాటివ్వకుండా అడ్డుకుంది. కాస్త అతిగారాబంగా పెరిగిన ఆ పెంకిపిల్ల నీ చేతిలో పెడితే దాన్నర్థం చేసుకుని నెమ్మదిగా దాన్ని మార్చుకుంటావని నా నమ్మకం. నీకంటే నా మనసు విప్పి చెప్పే ఆప్తులు నాకెవ్వరున్నారని' అని మీ నాన్న కంట తడిపెట్టుకున్నప్పుడు, నేను బాధపడ్డా పర్వాలేదు మావయ్య కంట తడి తుడవాలనుకున్నాను. ఇటు మా అమ్మ, అటు మామయ్య. ఆ ఇద్దరికోసం నేను బలయినా పర్వాలేదనుకున్నాను. అదే నేను చేసిన తప్పా. నన్ను కనడమే మా అమ్మ చేసిన




తప్పా! నీలో మార్పు వస్తుందని నేనెంతో నిరీక్షించాను. నా ప్రాణానికి ప్రాణమైన ఉద్యోగాన్ని కించపరిచినా, కేవలం తెలియనితనంతో అందరిలాగే ఆమె అలా అంటుందని సర్దుకుపోయాను కానీ, ఎవరు నీ క్షేమాన్ని కాంక్షించారో అలాంటి మా అమ్మను నీవీనాడు కించపరిచావు. ఆమె గురించి నీకేం తెలుసు. గర్వంతో కళ్ళు మూసుకుపోయిన నీకు మమతానుబంధాల మాధుర్యం ఎలా తెలుస్తుంది. ఇందాకేమన్నావు. మా అమ్మే నీ బ్రతుకులో చీకట్లు నింపిందా! సంధ్యా! నీకు తెలియని నిజం ఒకటి తెలుసుకో.

నేను చదువుకుంటున్న రోజుల్లో మా చుట్టుపక్కల వాళ్ళు 'నీకేమమ్మా మీ అన్న కూతురుంది. మీ రవికి ఈడు కుదురుతుంది' అన్నప్పుడు మా అమ్మ వారితో ఏమందో తెలుసా! 'మా అన్నయ్య తాహతుకు ఏ రాజకుమారుడో దొరుకుతాడు. నా మేనకోడలు ఏ ఉన్నింటి కోడలో అయి సుఖపడాలనే నేను మనసారా ఆ దేవుని కోరుకుంటున్నాను. ఆ చక్కని చుక్కకు ఏం తక్కువ. ఆస్తిలోను, అందంలోను దానికదే సాటి. ఇంకెప్పుడూ ఇలాంటి మాటలు అనకండి' అని కరాకండిగా చెప్పింది మా అమ్మ. అలాంటి ఆమె పేరును ఉచ్ఛరించడానికి కూడా నీకు అర్హత లేదు.

ఆనాటి నుంచి నా జీవితాశయం ఎలాగైనా కష్టపడి చదివి ఉద్యోగం సంపాదించి మా అమ్మను సుఖపెట్టాలనుకున్నాను. నా చిన్నప్పుడు ఆమె పడ్డ కష్టాలు చూసి మొదటిసారిగా నేను ఉద్యోగిగా మా అమ్మ కళ్ళముందుకు వెళితే ఆమె కళ్లలో ఆ మెరుపు చూసి గర్వపడ్డాను. నీ కష్టాలు ఈరోజుతో గట్టెక్కాయి. ఏం కావాలో కోరుకోమన్నాను. మాట తప్పవుగా అంది. అమ్మా! నన్నే సంశయిస్తున్నావా! నీ పెంపకంలో పెరిగానమ్మా. నీకోసం నా ప్రాణమైనా ధారపోస్తానన్నాను. మా అమ్మ పాదాలనంటి ప్రణమిల్లుతుంటే అక్షింతల్లా పడ్డాయి నా తల మీద అమ్మ కళ్ళలోనుంచి రాలిన కన్నీటిబొట్లు. 'నిన్ను కన్నందుకు కాదురా కన్నా! నీవామాట అన్నందుకు. మొదటిది అందరు తల్లులు చేసే పనే. కానీ, రెండవది నూటికి కోటికి ఒకరు నా రవీంద్ర లాంటివారు మాత్రమే చేయగలది. ఇది చాలు నాకీ జన్మకు. నాకు సంధ్యను కోడలిగా తే. ఇప్పుడు గర్వంగా చెబుతున్నాను. నీకో గౌరవప్రదమైన పోలీసాఫీసర్ ఉద్యోగం దొరికింది. ఇప్పుడు నీవు సంధ్యకు తగిన వరుడివి. మామయ్యతో తలెత్తుకుని మాట్లాడే హోదాని నీవు నాకిప్పుడు కల్పించావు' అంది. ఇదీ మన పెళ్ళి ఫ్లాష్‌బాక్. అలాంటి ఆమెనా నీవు తూలనాడేది. ఇప్పటిదాకా నా మనసులో ఎక్కడో మినుకుమినుకు మంటున్న ఆ కాస్తా ప్రేమని కూడా చెరిపేసుకున్నావు నేటితో. నా మనసులోనే కాదు, ఈ ఇంట్లో కూడా నీకు స్థానం లేదని – చదువుకున్నదానివి కనుక, వేరుగా మళ్ళీ చెప్పక్కర్లేదనుకుంటా'' చెప్పడం ఆపాడు రవీంద్రనాథ్.

మొదటిసారిగా ఇంత తీవ్రస్థాయిలో మందలించిన భర్తను చూసి మౌనంగా లోపలికెళ్ళి కాసేపట్లో సూట్‌కేస్‌తో బయటకు నడిచింది మారుమాట్లాడకుండా సంధ్య.

'మిస్టర్ రవీంద్రనాథ్, పార్లమెంట్ ఎలక్షన్ డ్యూటీ మీద మీరు వెంటనే శ్రీకాకుళం వెళ్ళాలి – మోస్ట్ అర్జంట్'. ఆర్డర్ కాపీ తీసుకుని మయలుదేరాడు రవీంద్రనాథ్. వెళ్తూవెళ్తూ క్యాజువల్‌గా లెటర్ బాక్స్ వంక చూశాడు. మామయ్య దగ్గరనుంచి లెటర్. ఊహించిందే. అంతా చదివి అనుకున్నాడు. మామయ్య, అమ్మ నన్ను అర్థం చేసుకున్నారు. అంతేచాలు అనుకుని తన కెరీర్‌లో మొదటి ఎలక్షన్ డ్యూటీకి ఉత్సాహంగా ప్రయాణమయ్యాడు రవీంద్రనాథ్.

***

''అమ్మా! సంధ్యా'' వస్తూనే పిలిచాడు వెంకట్రామయ్య. తండ్రి పిలుపు అలారం టైంపీసు కింద లెక్క. ఆయన పిలుపునుబట్టే చేయాల్సిన పని అర్థమౌతుంది సంధ్యకి. టైం చూసింది. టి.వీలో ప్రాంతీయ వార్తల టైం. ఏడవడానికి ఇంకో రెండు

నిముషాలే. పార్లమెంటు ఎలక్షన్స్ మూలంగా ఉదయం నుంచి బిజీగా తిరిగి అలసివచ్చిన నాన్నగారికి కాస్త చల్లని మజ్జిగయినా కలుపుకుని వద్దామని లోపలికెళ్ళింది సంధ్య టి.వి. ఆన్ చేసి. అంతే! బ్రహ్మాండం బద్దలైనట్లు, కాళ్ళకింద భూమి కదులుతున్నట్లు తనని తాను కంట్రోల్ చేసుకోలేక కుప్పకూలిపోయారు కుర్చీలో అలాగే వెంకట్రామయ్యగారు – టి.విలో ఆ వార్త విన్నవెంటనే.

'శ్రీకాకుళం ఏజెన్సీ ఏరియాలోని ఓ పోలింగ్ బూత్‌లో బాక్సులు ఎత్తుకెళ్ళడానికి ప్రయత్నించిన దుండగులను పోలీసులు అడ్డుకున్నారు. వారితో వీరోచితంగా పోరాడి బాక్సులను వారినుంచి కాపాడే ప్రయత్నంలో సఫలమైన రవీంద్రనాథ్ అనే సబ్ ఇన్‌స్పెక్టర్‌కు తీవ్రమైన బుల్లెట్ గాయాలు. అపస్మారక స్థితిలో వున్న ఆ సబ్ ఇన్‌స్పెక్టర్‌ను హుటాహుటిన హెలికాప్టర్‌లో రాష్ట్ర రాజధానిలోని నిమ్స్‌కు తరలింపు'. ఆ వార్తే వెంకట్రామయ్య గుండెల్ని తాకింది. మజ్జిగ గ్లాసుతో వచ్చిన సంధ్య దీర్ఘాలోచనలో కళ్ళు మూసుకుని ఏదో ఆలోచిస్తున్నాడని డిస్టర్బ్ చేయకూడదనే ఉద్దేశ్యంతో గ్లాసు టేబుల్‌మీదే పెట్టి మౌనంగా లోపలికెళ్ళింది. ఏదైనా జరగకూడనిది జరిగితే కూతురి వైధవ్యం. ఆ మాట తలచుకుంటేనే వెన్నులో వణుకు పుట్టింది వెంకట్రామయ్యకి. చెల్లెలు రాజ్యలక్ష్మికి ఎలా చెప్పాలీ వార్త. తనే ఇలా బెంబేలు పడిపోతే ఎలా. నెమ్మదిగా గుండె దిటవు చేసుకుని మెల్లిగా లేచాడు వెంకట్రామయ్య. తనతోపాటు ఆ ఊళ్ళో చాలామంది టి.వి. వార్తలు విన్నారని, ఆ వార్త క్షణాల్లో ఊరంతా పాకిందని బైటికెళ్ళిన వెంకట్రామయ్యకు ఇట్టే తెలిసిపోయింది. తనను పరామర్శించడానికి వచ్చిన మిత్రులు, శ్రేయోభిలాషులు. మరికొన్ని క్షణాల్లోనే మరుభూమిలా మారిపోయిందా ప్రాంతం. సర్పంచ్ గారి అల్లుడు చావుబతుకుల్లో వున్నాడని ఊరు ఊరంతా కదిలివచ్చింది. మరికాసేపట్లో హైదరాబాద్ బయలుదేరడానికి సన్నద్ధమౌతున్న తరుణంలో ఓ తెల్లటి అంబాసిడర్ కారు వచ్చి ఆగిందా ఇంటిముందు. అంతా ఊపిరి బిగబట్టి చూస్తున్నారు. 'రవీంద్రనాథ్ సార్ భార్య' – కారు దిగి అడుగుతున్న డ్రైవర్ మాట పూర్తికాకుండానే ''ఇదే ఇల్లు. ఆయనే వెంకట్రామయ్యగారు. వాళ్ళ మామగారు'' చెప్పారెవరో. అంతా నిశ్శబ్దం. ఏం వినవలసి వస్తుందోనని ఆందోళనగా చూస్తున్నారు – అతను చెప్పబోయే విషయంకోసం.

''రవీంద్రనాథ్ సాబ్‌కు నిమ్స్‌ల జాయిన్ చేసింర్రు. ఎవ్వరు పరేషాన్ కావలసిన అవసరం లేదు. సీరియస్ ఏమీలేదు. డి.జి.పి. అయ్యగారి హుకుం. ఈ అడ్రసుకు బోయి వాళ్ళ ఫ్యామిలీకి తీసుకురమ్మని కారిచ్చి నన్ను బంపింర్రు'' నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ తన యాసలో చెప్పాడా కానిస్టేబుల్.

రవీంద్రనాథ్ దగ్గరినుంచి వచ్చిన మనిషి చెప్పడంతో అక్కడివారి మనసులంతా కాస్త తేలికపడ్డాయి. అయినా ఏదో ఆత్రుత. చూసేవరకు నమ్మలేని సందిగ్ధం. ఎందుకంటే ఇలాంటి సందర్భాల్లో యదార్థాలు అంత తొందరగా తెలియవు. బస్సు బోల్తా ముగ్గురి మరణం, ముప్పైమందికి గాయాలు అని వార్త అయితే, యదార్థంగా ముప్పై మంది మరణించి, ముగ్గురు కొనఊపిరితో ఉంటారక్కడ. అందుకే అందరి ముఖాల్లో విషాదం.

శోకసాగరంలో మునిగి నిలబడ్డానికి కూడా శక్తి లేని రవీంద్ర తల్లి రాజ్యలక్ష్మిని ఎవరో తోడ్కొని వచ్చి కార్లో కూర్చోబెట్టారు. దుండగులతో రవీంద్ర వీరోచిత పోరాటాన్ని ప్రాణాల్ని సయితం లెక్కచేయక బ్యాలట్ బాక్సులను కాపాడిన వైనాన్ని టి.వి. క్లిప్పింగ్స్ చూసిన ఆ ఊరి జనం వేనోళ్ళ అతనిని కొనియాడుతుంటే ఆ జనం మధ్యనుంచి మౌనంగా వచ్చి కార్లో కూర్చుంది సంధ్య. వెంకట్రామయ్య దంపతులు కూడా ఆ వెనకాలే కారెక్కారు. కదిలింది కారు.

***

ఆ మరుసటిరోజు ఉదయం.

నిమ్స్ హాస్పిటల్ ప్రత్యేక వార్డులో...

కళ్ళు తెరిచి చూసిన రవీంద్రనాథ్‌కి, ఎన్నో రోజుల నుంచి భోజనం లేక నీరసించినట్టు మొహమంతా పీక్కుపోయి నిద్రలేమితో దిగాలుగా ఓపక్కగా కుర్చీలో ఒదిగి కూర్చుని తననే తదేక దృష్టితో చూస్తున్న సంధ్య కనిపించింది. తన కళ్ళను తనే నమ్మలేకపోయాడు. నాటి సంధ్యేనా ఈమె. దగ్గరికి రమ్మన్నట్టు చేతితో సైగ చేశాడు. ఇంతలో న్యూస్‌పేపర్ తీసుకురావడానికెళ్ళిన గార్డు లోపలికి వచ్చాడు పేపర్‌తో.

''సార్! అమ్మగారు రాత్రి వచ్చినప్పటినుంచి మీ దగ్గరే వున్నారు సార్. రాత్రి వచ్చిన మీవాళ్ళంతా ఎంత రమ్మన్నా వెళ్ళలేదు. అయ్యగార్కి నేను చూసుకుంటాను అన్న నన్ను కూడా నీవెళ్ళి రెస్ట్ తీసుకోమన్నారు సార్. టకటక పూసగుచ్చినట్టు చెప్పాడు గార్డు.

''అంటే సంధ్యా! నీవు రాత్రి మామయ్య వాళ్ళతో పాటు రూంకు వెళ్ళలేదా! రాత్రంతా నాతోనే వున్నావా! నిద్ర కూడా పోలేదులా వుంది'' ఆప్యాయంగా సంధ్య చేతిని తన చేతిలోకి తీసుకుని పక్కన కూర్చోమన్నట్టు కాస్త జరిగాడు.

భర్త పక్కన ఒదిగి కూర్చుంది సంధ్య మౌనంగా. సంధ్యలో కనిపించిన ఈ మార్పు, తీవ్ర గాయాల పాలై నీరసించిన రవీంద్రకు కొత్త ఊపిరిపోసింది.

వంట్లో మందు పనిచేయనిచోటు మనస్సు. ఆప్యాయత, అనురాగాలే అందించాలక్కడ ట్రీట్‌మెంట్. అదే జరిగింది.

గార్డు తెచ్చిన న్యూస్‌పేపర్ తిరగేస్తున్న సంధ్య ఉన్నట్టుండి భర్త గుండెలపై వాలి బోరున విలపించింది. ఊహించని ఈ పరిణామానికి కలవరపడ్డ రవీంద్రనాథ్ ఆమె చేతిలోని పేపర్ వంక చూశాడు.

'ప్రాణాపాయం నుంచి బైటపడ్డ రవీంద్రనాథ్'

'సి.ఎం. ప్రశంస – హెచ్.ఎం. పరామర్శ'

'నేటివ్‌ప్లేస్‌లో వున్న రవీంద్రనాథ్ సతీమణిని హైద్రాబాద్ నిమ్స్‌కు పిలిపించడానికి వాహనం పంపి ఆఘమేఘాల మీద రప్పించిన డి.జి.పి.'

'ప్రభుత్వ హెలికాప్టర్ అందుబాటులో వుండడం, నిమ్స్‌కు వెంటనే తరలించడం వల్ల ప్రాణ గండం తప్పిన రవీంద్రనాథ్'

'సబ్‌ఇన్‌స్పెక్టర్ రవీంద్రనాథ్‌కు రాష్ట్రపతి పతకానికై రాష్ట్ర ప్రభుత్వం సిఫార్సు'

పేపరు నిండా ఇవే వార్తలు. బాక్సులు కట్టి రాశారీ వార్తలు. రవీంద్రనాథ్ మనస్సు పులకించింది –

న్యూస్ పేపర్లో వచ్చిన వార్తలను చూసి కాదు

తన ప్రాణం దక్కినందుకు కాదు –

తన ఈ పోలీసు వృత్తిని గౌరవించడమే కాదు, సంధ్య ఈ వృత్తిని ఆరాధించే స్థాయికి ఎదిగింది అని.

పోలీసు భార్యగా ఆమె మొట్టమొదటిసారిగా గర్వంగా ఫీలవుతున్నట్టు తన కళ్ళకి కనబడినందుకు.

★

